సాక్షి ఒడిశా


బుధవారం । 17 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,74,382
బంగారం	3 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి	11 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



జగన్నాథ 'రహస్యం'

పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ క్షణానికో మలుపు తిరుగుతోంది.

- 8లో



రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

జయపురం సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి డాలియగుడ గ్రామానికి చెందిన వై.తవుడు కుటుంబ సభ్యులు వ్యాన్‌లో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

ట్రై సైకిళ్లు అందజేయరూ..?



నిరుపయోగంగా ఉన్న ట్రై సైకిళ్లు

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘంలో గత కొన్ని నెలలుగా దివ్యాంగులకు అందజేసే ట్రై సైకిళ్లు కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో వీటిని అందజేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పురపాలక సంఘం చైర్‌పర్సన్ నిర్మలా శెఠి మాట్లాడుతూ.. ఇదివరకు ఎన్నికల కోడ్ ఉండడంతో పంపిణీ ప్రక్రియ వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలో లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పరికరాలు

జయపురం: బొయిపరిగుడలోని ఓం కౌశల్య పెట్రోల్ బంక్‌లో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పొగ విస్తరించి బంక్ ప్రాంతమంతా వ్యాపించడంతో సిబ్బంది అప్రమత్తమై ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బంక్ యజమాని వెంటనే బొయిపరిగుడ అగ్నిమాపక విభాగానికి ఫోన్‌చేసి పరిస్థితిని తెలియజేయగా, వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బంక్‌లోని పరికరాలు పూర్తిగా కాలిపోయినా, పెట్రోలు పంపులు ప్రమాదానికి గురవ్వకపోవడంతో అతి పెద్ద ప్రమాదం తప్పింది.

పెన్షన్లు అందజేత



పెన్షన్ అందజేస్తున్న అధికారులు

జయపురం: బొరిగుమ్మ సమితి రణస్‌పూర్ పంచాయతీ చండాల్‌గుడ గ్రామంలో బతికున్న వారిని మరణించినట్లుగా చూపించి పెన్షన్లు నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై సామాజిక కార్యకర్త బి.హరిరావు, బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు బాధితులకు దాదాపు 11 నెలలు నిలుపుదల చేసిన పెన్షన్‌ను మంగళవారం అందజేశారు. దీంతో బాధితులు హర్షం వ్యక్త చేశారు.

నేడు శ్రీజగన్నాథుని స్వర్ణాలంకారం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని వార్షిక రథ యాత్ర ముగింపు దగ్గర పడుతోంది. స్వామియాత్ర ఆద్యంతాలు ఆసక్తికరం. యాత్రకు ముందు నవ యవ్వన శోభతో దర్శనమిచ్చే స్వామి, యాత్ర ముగింపు పురస్కరించుకుని స్వర్ణ శోభతో శోభిల్లుతాడు. సుమారు అర్ధరాత్రి వరకు భక్తులకు స్వర్ణ అలంకరణలో దర్శనం లభిస్తుంది. ఈనెల 17వ తేదీ బుధవారం శ్రీజగన్నాథుని స్వర్ణాలంకార దర్శనం లభిస్తుంది. ఈ మేరకు అనుబంధ యంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా రద్దీ నియంత్రణ కోసం వాహనాల రవాణా నియంత్రణ, అనుసంధాన వీధులకు ప్రవేశమార్గాలు సీలు వంటి చర్యలు చేపడుతున్నారు. ఉదయం 6 గంటలకు మంగళ హారతి సమర్పించి, 10.30 గంటల సరికి బాలభోగం నివేదన పూర్తి చేయాలని సమయం ఖరారు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల మధ్య మధ్యాహ్న ధూప సేవ కార్యక్రమం ముగించి, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య రథాలపై మూల విరాటుల స్వర్ణ అలంకరణ పూర్తి చేస్తారు. అలంకరణ పూర్తి కావడంతో రథాలపై స్వర్ణ శోభిత దేవుళ్లని దర్శించేందుకు భక్తులకు సర్వ దర్శనం కల్పిస్తారు. సుమారు రాత్రి 11 గంటల వరకు నిరవధికంగా స్వర్ణాలంకార దర్శనం కల్పించేందుకు యోచిస్తున్నారు. రద్దీ తీవ్రతరం అయితే భక్తులను తొలగించి సకాలంలో పనులు పూర్తి చేస్తామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాకి మిశ్రా తెలిపారు. స్థానిక మెడికల్ ఛక్ నుంచి రథాల ప్రాంగణం వరకు బొడొ దండొ మార్గంలో దారి పొడవునా తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేసి దర్శన రద్దీ నియంత్రిస్తారు. మెడికల్ ఛక్ నుంచి భక్తులు కాలి నడకన రావాల్సిందే. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక పోలీసు దళాల్ని మోహరిస్తారు.

మరో మారు..!

- రేపు మళ్లీ రత్న భాండాగారం ఓపెన్
- ఉదయం 9.51 గంటలకు సుముహూర్తంగా నిర్ణయం
- పర్యవేక్షణ కమిటీ సమావేశంలో నిర్ణయం



వివరాలు వెల్లడిస్తున్న సీఏవో అరవింద కుమార్ పాఢి



పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం మరోసారి తెరవనున్నారు. ఈసారి కూడా శుభ ఘడియల్లో తెరిచేందుకు నిర్ణయించారు. రత్న భాండాగారం తనిఖీ ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీ నిర్ణయం మేరకు ఈనెల 18వ తేదీ ఉదయం 9.51 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల మధ్య ఈ సన్నాహాలు చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఏర్పాటు చేసిన 11 మంది సభ్యుల కమిటీ అత్యవసర సమావేశం శ్రీమందిర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. కమిటీ సభ్యులందరూ సమావేశంలో పాల్గొని వివరంగా చర్చించారు. శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) డాక్టర్ అరవింద కుమార్ పాఢి సమావేశం వివరాలు మీడియాకు వివరించారు.

సురక్షితంగా ఆభరణాల తరలింపు

రత్న భాండాగారంలో ఆభరణాలు వగైరా సురక్షితంగా తరలించడమే ప్రధాన అజెండాగా చర్చ కొనసాగింది. సమావేశ నిర్ణయం మేరకు ఈనెల 18న మళ్లీ ఆలయంలోని రత్న భాండాగారం తెరిచి లోపల ఉన్న ఆభరణాలను తరలిస్తారు. ప్రధాన ఆలయం సముదాయంలోని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లోపలికి పకడ్బందీ వ్యవస్థ మధ్య తరలిస్తారు. ఈ విధానాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాల ప్రకారం జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన తొలిసారిగా రత్న భాండాగారం తెరిచిన విషయం తెలిసిందే. వెలుపలి గది పర్యవేక్షణ ముగించి ఆభరణాలు వగైరా తొలగించి ఖాళీ చేశారు. లోపలి గది తాళాలు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. నకిలీ తాళం చెవిలతో తాళాలు తెరవకపోవడంతో విరగగొట్టి, గదిలోనికి ప్రవేశించినట్లు సీఏవో మరోసారి గుర్తు చేశారు. కానీ సమయాభావం వల్ల ఆభరణాల తరలింపు ప్రక్రియ చేపట్టకుండా పొడిగించారు. లోపల గదికి 3 తాళాలు వేసినట్లు గుర్తించారు. వాటిలో ఒకటి సీల్ వేసి ఉండగా, మిగిలిన రెండు సీలు లేకుండా ఉన్నట్లు రత్న భాండాగారం తనిఖీ ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీ బృందం గుర్తించింది. పాత తాళాలు విరగ్గొట్టడంతో మేజిస్ట్రేట్ సమక్షంలో రెండు కొత్త తాళాలు వేసి సీల్ చేసి, వాటి తాళం చెవిలు ట్రెజరీలో జమ చేశారు.

మరమ్మతులకు అప్పగింత

రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాల ప్రకారం వెలుపలి మరియు లోపలి గదుల్లో రత్నాల వస్తువుల తరలింపు పూర్తయ్యి, ఖాళీ చేసిన తర్వాత వాటి మరమ్మతుల కోసం భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ)కి అప్పగిస్తారు. పురావస్తు శాఖ మరమ్మతులు పూర్తి చేశాక తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోని ఆభరణాలన్నింటినీ తిరిగి రత్న భాండాగారంలో యథాతథంగా భద్రపరిచేందుకు తరలిస్తారు. తాజాగా జారీ అయిన మార్గదర్శకాల ప్రకారం రత్న సంపద అన్ని లెక్కలు మరియు అంచనాలు జరుగుతాయని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి తెలియజేశారు.

ప్రభుత్వ అధికారిపై గవర్నర్ కుమారుడి దాడి



రాజ్ భవన్ ఎదురుగా కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

- అరెస్టు చేయాలని విపక్షాల డిమాండ్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ అధికారిపై గవర్నర్ రఘుబర్ దాస్ కొడుకు అమానుష దాడి క్రమంగా రగిలి రాజకీయంగా వేడెక్కుతోంది. మరోవైపు బీజేపీ ప్రభుత్వం తొలి శాసనసభా సమావేశాలు దగ్గర పడుతున్నాయి. ఈ సమావేశాల్లో కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరపు పూర్తిస్థాయి బడ్జెటు సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా గవర్నరు ప్రసంగం ఉంటుంది. ఈ నెల 22న రాష్ట్ర శాసన సభని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం సమయంలో శాసన సభ దద్దరిల్లే వాతావరణం అలముకుంటోంది. రాజ్‌భవన్ సిబ్బందిపై గవర్నర్ కుమారుడు, ఆయన సహచరులు దాడి చేశారని ఆరోపణతో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ వర్గాలు ఉద్ధృతంగా విజృంభించేందుకు రంకెలు వేస్తున్నాయి. ఆందోళన తీవ్రతరం అవుతున్నందున అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) మరియు అతని భార్యతో గవర్నర్ మాట్లాడారు. ఈ సంఘటనపై విచారణ కోసం ఠాణాలో ఫిర్యాదు దాఖలైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు లేకపోవడంతో రాజకీయంగా ఆందోళన ఊపందుకుంటోంది.



విలేకరులతో మాట్లాడుతున్న లేఖశ్రీ సామంత సింగార్

మంగళవారం బీజేడీ నాయకురాలు డాక్టర్ లేఖశ్రీ సామంత సింగార్ గవర్నర్ కుమారుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ కుమారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజ్‌భవన్ ముందు కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ కాంగ్రెసు భవన్‌లో మీడియా సమావేశంలో స్పందించారు. నిందిత గవర్నర్ కొడుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

'ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి'



మాట్లాడుతున్న చంద్రప్రతాప్ సింగ్

జయపురం: ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ హిందీ పరిశోధకుడు డాక్టర్ చంద్రప్రతాప్ సింగ్ అన్నారు. స్థానిక జగదీష్ చంద్ర నాయిక్ ఉన్నత పాఠశాలలో హిందీ శిక్షక నవీకరణ పాఠ్యక్రమ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 70 మందికిపైగా హిందీ ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. నూతన పాఠ్యక్రమంలో అంశాలను బోధించే విధానాన్ని తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందీ భాష ప్రచారకుడు, హిందీ ఉపాధ్యాయుడు భగవాన్ సాబత్ వెల్లడించారు. ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రప్రతాప్ సింగ్ ముఖ్య వక్తగా పాల్గొని హిందీ శిక్షక నవీకరణ పాఠ్యక్రమంపై వివరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కొరాపుట్ జిల్లా హిందీ శిక్షక సంఘ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ ఖోశ్ల, జగదీష్ చంద్ర నాయిక్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉపేంద్ర కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగులు తిని నలుగురికి అస్వస్థత

రాయగడ: అడవిలో లభించే విషపూరిత పుట్ట గొడుగులు తిని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలోని కాసీపూర్ సమితి గొరఖ్‌పూర్ పంచాయతీ లిమోడారొ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన వారిలో కొంధొ నాయక్ (60), అతని ఇద్దరు భార్యలు రత్నావతి నాయక్, దుఖీ నాయక్, కూతురు పుత్రవధి నాయక్‌లు ఉన్నారు. ఆదివారం తెచ్చుకున్న పుట్ట గొడుగును రాత్రికి వండుకుని తిన్నారు. దీంతో అర్ధరాత్రి సమయంలో వారందరూ వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

మహిళా క్రికెటర్ల ఎంపికలు ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న మహిళా క్రికెటర్లు

జయపురం: కొరాపుట్ జిల్లా మహిళా క్రికెట్ టీమ్‌కు క్రీడాకారిణుల ఎంపిక ప్రారంభమైంది. ఈ మేరకు స్థానిక విక్రమ్ క్రీడా మైదానంలో పేర్లను మంగళవారం నమోదు చేశారు. వారిలో ఉత్తమంగా రాణించినవారిని టీమ్‌లో ఎంపిక చేయడం జరుగుతుందని కొరాపుట్ అథ్లెటిక్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రబి నాయిక్ వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం 21 మంది మహిళా క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వారికి కోచ్‌లు వై.ప్రసాద్, బలరాం పాణిగ్రాహి, ఇ.సత్యనారాయణల ఆధ్వర్యంలో రెండు రోజుల కోచింగ్ ఉంటుందని, అనంతరం టీమ్ ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 25వ తేదీన కటక్‌లో మహిళా క్రికెట్ లీగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి అనూప్ కుమార్ పాత్రో, సభ్యులు బాలారాయ్, భవానీ పండ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: రాజవీధిలో పిన్నిగారింటి వద్ద విడిది చేసిన జగన్నాథుడు



రాయగడ: రథంపై దేవతామూర్తులు



జయపురం: నిజ మందిరానికి వెళ్తున్న స్వామివారి రథం

భక్తిశ్రద్ధలతో జగన్నాథుడికి పూజలు

గుండిచా మందిరం నుంచి తిరుగుముఖం పట్టిన జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తుల రథాలు చాలాచోట్ల నిజ మందిరాలకు చేరుకున్నాయి. అయితే పలుచోట్ల సోమవారం రాత్రి రథంపైనే ఉండి పూజలు అందుకున్నారు. దశమితో పాటు మంగళవారం సంక్రాంతి కావడంతో దేవతామూర్తులను రథంపైనే ఉంచారు. మరికొన్ని చోట్ల దేవతామూర్తులు పిన్నమ్మ ఇంటి వద్ద విడిది చేశారు. ఈనెల 17న ఏకాదశి సందర్భంగా అక్కడ ఆతిథ్యం పొందుతారు. అనంతరం ద్వాదశి సందర్భంగా గురువారం రథాలు నిజ మందిరానికి చేరుకుంటాయి. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: చైతన్య మందిరం వద్ద దేవతామూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు



జయపురం: భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం



జయపురం: భక్తులకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న యువకులు



జయపురం: రథ చక్రాల వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



పర్లాకిమిడి: భక్తులకు దర్శనమిస్తున్న నల్లనయ్య



జయపురం: రథయాత్రకు పోటెత్తిన భక్తజనం

క్లుప్తంగా

సోలార్ ప్యానెళ్ల చోరీ కేసులో 8 మంది గుర్తింపు

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామంలో చొక్కర అప్పలనాయుడికి సంబంధించిన 8 సోలార్ ప్యానల్‌లు, నామాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటసత్యంకి చెందిన 5 సోలార్ ప్యానళ్లను దొంగిలించడంపై వారు ఇటీవల స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది కొంత మంది నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కేసుల్లో 8 మందిని గుర్తించినట్లు ఎస్‌ఐ జీవీ ప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. 13 సోలార్ ప్యానల్ రికవరీ చేసినట్లు ఆయన తెలియజేశారు. నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించి, వారికి సహాయం అందించిన వారికి కూడా విచారణ చేశారు.

ఎత్తిపోతల విద్యుత్ పరికరాల దొంగతనంపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: నారాయణవలస ఎత్తిపోతల పథకానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్- కూలింగ్ ఆయిల్, ఇతర పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఏపీఐడీసీ ఏఈ జి.మధుసూదనరావు మంగళవారం కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పథకాన్ని పరిశీలించేందుకు వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి విలువైన సామగ్రి దొంగిలించినట్లు గుర్తించామన్నారు. గత నెల 24 నాటికి పరికరాలన్నీ సక్రమంగా ఉన్నాయని, లిఫ్ట్ కూడా పనిచేస్తోందని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు.

యోగా కోర్డినేటర్ నియామకం



టీచింగ్ అసిస్టెంట్ మూర్తికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగా ఫిట్‌నెస్ మేనేజ్ మెంట్ కోర్సు కోఆర్డినేటర్‌గా టీచింగ్ అసిస్టెంట్ కేవీఎస్ మూర్తిని నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ పి.సుజాత ఉత్తర్వులు జారీచేశారు. ఏడాది కాల పరిమితికి నియమించారు. ఉత్తర్వులను వీసీ కె.ఆర్.రజిని అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి మండలంలోని కొత్తవలస నిమ్మతొర్లాడ గ్రామాల మధ్య నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సమాచారం ముందుగానే అందడంతో వారంతా పారిపోయారు. అదే దారిలో వస్తుండగా తెల్లవారుజామున ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి పార్వతీశ్వరునిపేట సమీపంలో ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఆ రెండు ట్రాక్టర్‌లు కొత్తవలస గ్రామానికి చెందినవిగా గుర్తించారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఇసుకతో ఉన్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.


'దేశంలో సామాజిక విప్లవం రావాలి'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

కాశీబుగ్గ: దేశంలో సామాజిక విప్లవాన్ని తీసుకురావాలని, అది కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక టీకేఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు సామాజిక ఉద్యమంతో అసమానతలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలు ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని అన్నారు. 99 ఏళ్ల రాజకీయ చరిత్రలో అనేక పోరాటాలు నడిపిన కమ్యూనిస్టు పార్టీని పటిష్టం చేసుకోవడానికి మార్గాలు అన్వేషించాలన్నారు. అనంతరం రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యులు కె.ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పాలనను ఎండగట్టారు. జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, సనపల నర్సింహులు, ఎం.యుగంధర్, ఆరేళ్లమ్మ, కొన్న శ్రీనివాసరావులు ప్రసంగించారు.

జగన్నాథ రహస్యం



పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయిక్ రూపొందించిన రత్న భాండాగారం సైకత శిల్పం(ఫైల్)

- రత్న భాండాగారంపై వెల్లువలా సందేహాలు
- మూడు తాళాల్లో ఒకదానికి మాత్రమే సీలు
- మిగిలిన 2 తాళాలకు సీలు మాయం
- పాత విచారణ కమిషన్ నివేదిక గోప్యం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరవడం పెను సవాలుతో కూడిన బృహత్కార్యం. ఈ ప్రక్రియ క్షణానికో మలుపు తిరుగుతోంది. మరోవైపు నిరాధారమైన అపోహలు గుప్పుమని సామాన్య భక్త జనులను కలవరపరుస్తున్నాయి. ఇంతకు ముందు భాండాగారం లోపలి గది తాళం చెవులు అదృశ్యం కావడంతో అందుబాటులో ఉన్న అదనపు తాళం చెవులతో పనులు చేయాలని నిర్ణయించారు. కొన్ని దశాబ్దాల తర్వాత రత్న భాండాగారం లోపలి గదిని తెరిచేందుకు పకడ్బందీగా నడుంబిగించారు. ముందుగా రెండు గదుల్లో నిక్షిప్తమై ఉన్న రత్న సంపదని చెక్కు చెదరకుండా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం, ఖాళీ అయిన రెండు గదులను పర్యవేక్షించి భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) అవసరమైన మరమ్మతులు చేపట్టడం, అనంతరం నగలు, ఆభరణాలు వగైరాని యథాతథంగా రత్న భాండాగారానికి తరలించడం సమగ్ర కార్యాచరణగా పేర్కొన్నారు. ఈ వ్యవధిలో బయటకు తీసిన నగలు, ఆభరణాలు ఇతరేతర సంపదని క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి వివరాలతో చిట్టా సిద్ధం చేస్తారు. ఇలా సిద్ధం చేసిన చిట్టాని అత్యాధునిక శైలిలో పారదర్శక రీతిలో భద్రపరుస్తారు. అయితే ఈ సన్నాహాల వాస్తవ కార్యాచరణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

తాళాలకు సీలు మాయం

అదనపు తాళం చెవులతో లోపలి గది తాళాలు తెరవబోయే సరికి సరికొత్త రహస్యం వెలుగుచూసింది. ఈ గదికి 3 తాళాలు వేసి ఉన్నాయి. ప్రభుత్వ ట్రెజరీ నుంచి పూరి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అందిన అదనపు తాళం చెవితో ఈ తాళాలు తెరిచేందుకు విఫల యత్నం చేశారు. అయితే ఏ ఒక్క తాళం కూడా పని చేయలేదు. ఈ పరిస్థితిని ముందస్తుగా ఊహించిన ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీ తాళం విరగ్గొట్టేందుకు సిద్ధమైంది. అయితే ఈ పరిస్థితిలో తాళాలకు ఉండాల్సిన సీలు లేనట్లు దృష్టికి వచ్చింది. మూడింటిలో రెండింటికి సీలు లేనట్లు జస్టిస్ బిశ్వనాథ్ రథ్ స్పష్టం చేశారు. సీలు లేకున్నా తాళం వేసి ఉందని ఆయన వివరించారు. దీనిపై దృష్టి సారిస్తామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. ప్రత్యేక విచారణతో దీని గుట్టురట్టు చేస్తామని ప్రకటించారు.

భక్తులకు ప్రవేశం నిషేధం

ఈ నెల 18న భాండాగారం లోపలి గది మరోమారు తెరిచేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా భక్తులకు పూరీ శ్రీమందిరం ప్రవేశంపై గురువారం ఆంక్షలు విధించారు. రత్న భాండాగారం తనిఖీ కార్యాచరణలో భాగంగా ఈ చర్యని చేపడుతున్నారు. రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టరు అరవింద్ కుమార్ పాఢి ఈ సమాచారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల తర్వాత కమిటీ సభ్యులు ఆలయంలోకి ప్రవేశిస్తారు.

సమయాభావంతో పొడిగింపు

ఈ నెల 14వ తేదీన జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ బృందం శ్రీమందిరంలోనికి ప్రవేశించింది. రత్న భాండాగారం తనిఖీ పురస్కరించుకుని ముందుగా వెలుపల గది తెరిచారు. దీనిలో భద్రపరిచిన నగదు సురక్షితంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. దీంతో వెలుపల గది ఖాళీ అయింది. తదుపరి లోపల గది అతి కష్టం మీద తెరిచారు. ఇంతలో సమయం దాటడంతో సామగ్రి తరలింపు ప్రక్రియను మరోరోజుకు పొడిగించారు. మర్నాడు శ్రీజగన్నాథుని మారు రథయాత్ర సన్నాహాల ఒత్తిడితో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు జస్టిస్ బిశ్వనాథ్ రథ్ తెలిపారు. రథయాత్ర హడావుడి తీరిన తర్వాత మలి విడత కార్యాచరణ ఖరారు అవుతుందని ప్రకటించారు.

తప్పుడు ప్రచారాలు ఆపండి

ఇటీవల రత్న భాండాగారం తెరవడంపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్య స్వాగత యోగ్యమని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ (ఓపీసీసీ) మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ అన్నారు. అయితే మహా ప్రభువు రత్న భాండాగారం తెరవడం 46 సంవత్సరాల్లో ఇదే మొదటిసారి అని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని విచారం వ్యక్తం చేశారు. గతంలో 1985 జూలై 14న ముఖ్యమంత్రి జేబీ పట్నాయక్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెరిచినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రత్న భాండాగారానికి సంబంధించిన తాళం చెవిని భద్రంగా ఉంచారు. తర్వాతి ప్రభుత్వాల హయాంలో తాళం చెవులు ఎలా పోయాయి అనేది దర్యాప్తు అంశంగా మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ దిశలో మీడియా వర్గాలు దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. వాస్తవాలు వెలుగులోకి రాకపోయినా, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండాలని కోరారు.

కొత్త నగలు కొనుగోలు చేయాలి

రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం శ్రీజగన్నాథుని కోసం కొత్తగా 5 సెట్ల ఆభరణాలు కొనుగోలు చేయాలని జగన్నాథ స్వామి బాడొగ్రాహి జగన్నాథ్ స్వంయి మహాపాత్రో ప్రతిపాదించారు. ఇలా చేస్తే రాష్ట్ర ప్రభుత్వ చర్య శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రత్న భాండాగారం తాళం చెవిలు పోయినందున తాళాలు పగలగొట్టాల్సి వచ్చిందని, ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా రత్న భాండాగారం లోపల ఉంచిన విలువైన వస్తువులను సరైన జాబితాను నిర్వహించాలని కోరారు.

నివేదిక వెల్లడించండి

రత్న భాండాగారం తాళం చెవి గల్లంతుపై గత ప్రభుత్వం విచారణ కమిషన్‌ను నియమించిందని బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు అమర ప్రసాద్ శత్పతి గుర్తు చేశారు. ఈ కమిషన్ విచారణ సైతం పూర్తయ్యిందన్నారు. ఇప్పుడు ఆ నివేదికని బహిరంగపరిస్తే పలు అపోహలకు తెర తొలగిపోతుందని వ్యాఖ్యానించారు. తరచూ కొత్త కమిషన్లు నియమించి విచారణ చేపడితే కథ ఎప్పటికీ ముగియదన్నారు.



జగన్నాథ ఆలయ సముదాయం(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



గాయపడిన 11 ఏళ్ల బాలిక

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి దసమంతపూర్ పంచాయతీ డాలియగుడ గ్రామానికి చెందిన వై.తవుడు కుటుంబ సభ్యులు బొయిపరిగుడలో సోమవారం సాయంత్రం బహుడను తిలకించేందుకు వ్యాన్‌లో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. బొయిపరిగుడకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని దాల్‌ఖాయి మందిర సమీపంలో వ్యాన్ అదుపు తప్పి, ఆ మార్గంలో వస్తున్న ఒక ఫారెస్టు గార్డును ఢీకొని రోడ్డు పక్కనున్న కాలువలో పడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే బొయిపరిగుడ పోలీసుస్టేషన్ ఏఎస్‌ఐ శివ శంకర నాయిక్ ప్రమాద స్థలానికి చేరుకొని అంబులెన్స్‌ను రప్పించి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 11 ఏళ్ల బాలికతో పాటు ముగ్గురు యువకులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. బాలికకు చెవి, తలపైన గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సమాచారం.

'జగదీశ్వరరావుకు దేశం రుణపడి ఉంటుంది'



జగదీశ్వరరావు భార్య సమతకు ధైర్యం చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్



జగదీశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీనివాస్, తిలక్

నందిగాం: దేశ రక్షణ కోసం ప్రాణాలను విడిచిన వీరజవాన్ సనపల జగదీశ్వరరావు చరిత్ర పుటల్లో నిలిచిపోతారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. సోమవారం జమ్ములోని దోడా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతాదళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన నందిగాం మండలం వల్లభరాయునిపాడుకు చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను వారు మంగళవారం కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భార్య సమత, తల్లిదండ్రులు, పిల్లలకు ధైర్యం చెప్పి దేశ ప్రజలంతా మీ వెంట ఉంటారని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎదురుకాల్పుల్లో జగదీశ్వరరావు మృతి చెందారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, దేశరక్షణలో ప్రాణాలు కోల్పోయిన జగదీశ్వరరావును దేశం యావత్తు గుర్తుంచుకుంటుందని తెలిపారు. వీరి వెంట నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండలపార్టీ అధ్యక్షుడు తమిరె పాల్గుణరావు, జడ్యాడ జయరాం, స్థానిక సర్పంచ్ మళ్ల సీతారాం, కవిటి ఎర్రన్న, చిన్ని జోగారావు, గ్రామస్తులు ఉన్నారు.

నేడు జిల్లా రోల్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా రోల్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా రోల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. పలాసలోని మదర్ థెరిస్సా స్కూల్ ప్రాంగణంలో ఉన్న గోపీచంద్ రోలర్ స్కేటింగ్ క్లబ్ వద్ద ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. మొత్తం నాలుగు వయో విభాగాల్లో ఎంపికలు జరగనున్నాయి. అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-17 పైబడి వయస్సు కలిగిన బాలబాలికలకు ఈ ఎంపికలను నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్న ఏపీరాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రోల్‌బాల్ సంఘ బాధ్యులు పంపించనున్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలబాలికలు తమ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం/టెన్త్‌క్లాస్ మార్క్స్ మెమో, 3 పాస్ ఫొటోలు, పూర్తి రోల్‌బాల్ కిట్‌తో హాజరుకావాలని కిరణ్‌కుమార్‌కోరారు. మరిన్ని వివరాలకు 92909 05399 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాల గోడ కూల్చివేతపై ఆందోళన



పాఠశాలలో కూల్చేసిన గోడను చూపిస్తున్న నిర్వాసితులు

ఎల్ఎన్ పేట: మండలంలోని తాయిమాంబాపురం (గార్లపాడు) వంశధార పునరావాస కాలనీలో ప్రాథమిక పాఠశాల తరగతి గది గోడను మండల విద్యా శాఖ అధికారి (ఎంఈఓ-1) సీహెచ్ మణికుమార్ కూలగొట్టడం వివాదాస్పదమైంది. వంశధార నిర్వాసితులు అక్కడకు చేరుకుని మంగళవారం ఆందోళన చేశారు. 1999లో ఎల్.ఎన్.పేట మండలం కొత్తగా ఏర్పడింది. అప్పటి నుంచి మండల విద్యా శాఖకు సంబంధించిన అన్ని వ్యవహారాలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోనే కొనసాగిస్తున్నారు. ఎంఈఓ-1గా సీహెచ్ మణికుమార్ వచ్చిన తర్వాత మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న తాయిమాంబపురం (గార్లపాడు) పునరావాస కాలనీలోని ప్రాథమిక పాఠశాలను పరిపాలన కార్యాలయంగా ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల కిట్లు పంపిణీ కోసం స్టోర్ రూమ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచే కిట్లు పంపిణీ చేశారు. మరో అడుగు ముందుకు వేసి పాఠశాలను ఎమ్మార్సీగా మార్చేందుకు సిద్ధమయ్యారని నిర్వాసితులు గవర గోవిందరావు, అగతముడి జీవరత్నం, జాయి భూపతి, జి.అనంతరావు, సురవరపు సింహాచలం, బి.శేషగిరి, బి.గోవిందరావు తదితరులు ఆరోపించారు. రెండు అంతస్తుల్లో ఉన్న పాఠశాలలో పైన రెండు తరగతి గదులు ఉన్నాయి. ఈ రెండు గదులకు మధ్యలో గోడ కూల్చేందుకు ఎంఈఓ సిద్ధమయ్యారని, విషయం తెలుసుకున్న తాము వెళ్లి అడ్డుకున్నామని నిర్వాసితులు తెలిపారు. పాఠశాలలో ఎమ్మార్సీ నిర్వహించటం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈఓ మణికుమార్ చర్యలపై జిల్లా కలెక్టర్, సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఎంఈఓ స్పందిస్తూ కూల్చివేసిన గోడను తిరిగి కట్టిస్తానని తెలిపారు. పరిపాలనా పరంగా మండల కేంద్రంలో విద్యా శాఖకు సరైన భవనం లేనందున ఈ పాఠశాలను ఎమ్మార్సీగా వినియోగించుకోవాలని అనుకున్నామన్నారు. ఎమ్మార్సీగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నిధులు ఇస్తామని అన్నారని, అందుకే గోడ కూలగొట్టే పనులు చేపట్టానని తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలకు చెందిన విద్యార్థినులు మరోసారి తమ ప్రతిభను కనబర్చారు. ఇటీవల వెలువడిన ఏపీ పీజీసెట్-2024 ఫలితాల్లో కళాశాలలోని వృక్షశాస్త్రం విభాగం విద్యార్థినులు అదిరేటి ర్యాంకులు సాధించి శభాష్ అనిపించారు. జంతుశాస్త్రంలో పేడాడ నీలిమ 35వ ర్యాంకు సాధించగా, వృక్షశాస్త్రంలో దుంపల మాధురి 23వ ర్యాంకు, పాలుముట పూజిత 23వ ర్యాంకు, జొన్న దేవయాని 29వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. పీజీలో గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, కాలేజీలను ఎంచుకున్నారు.

కళాశాలకు గర్వకారణంగా నిలిచారు

కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. పట్టుదల, అంకిత భావానికి ప్రణాళిక తోడైతే చదువులో ఉన్నతస్థాయిలో ప్రతిభ కనబర్చవచ్చని కళాశాల విద్యార్థినులు నిరూపించడంతో పాటు కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకులు, ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను మెచ్చుకున్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సీఓఈ ఆదిలక్ష్మి, బోటనీ హెచ్‌ఓడి ఎస్.రుద్రమరాణి, జువాలజీ హెచ్‌ఓడీ హేమపద్మజ, అధ్యాపకులు డాక్టర్ వై.రవికుమార్, సీహెచ్ సునీత, ఎ.వైష్ణవి అధ్యాపకులు పాల్గొన్నారు.

శతక్కొట్టాడు



సెంచరీ సాధించిన నంబళ్ల సుశాంత్

- సెంచరీతో అదరగొట్టిన సుశాంత్
- ఏసీఏ అంతర్‌జోనల్ మ్యాచ్‌ల్లో రాణింపు
- మరోసారి ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్టార్ ఆల్‌రౌండర్ నంబళ్ల సుశాంత్ మరోసారి శతక్కొట్టాడు. ఏసీఏ అంతర్‌జోనల్ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో 121 పరుగుల అజేయ సెంచరీతో కదంతొక్కాడు. గత కొన్నేళ్లుగా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణిస్తూ.. అత్యద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్న సుశాంత్ ఈ సీజన్‌లోనూ తన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న అంతర్‌జోనల్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నంబళ్ల సుశాంత్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యేందుకు నిర్వహించిన ఈ టోర్నీలో చూడచక్కటి ఆటతీరుతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు.



అంతర్‌రాష్ట్ర టోర్నీలో సుశాంత్‌కు క్యాప్‌ను అందజేస్తున్న కోచ్

విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టును సుశాంత్ భారీ ఓటమి నుంచి గట్టెక్కించాడు. మిగిలిన బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడంతో ఒంటరి పోరాటం చేయడంతో ఆ జట్టు 50 ఓవర్లలో 202 పరుగులు చేయగలిగింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ సుశాంత్ 16 బౌండ్రీలు, ఒక సిక్సర్ సాయంతో 121 పరుగులతో నాటౌట్‌గా నిలవడం విశేషం. సుశాంత్ స్వస్థలం జిల్లాలోని టెక్కలి పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ. ప్రస్తుతం శ్రీకాకుళంలోనే నివాసం ఉంటున్నారు. తండ్రి నంబళ్ల జగదీష్ రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి అర్చన గృహిణి.

క్రికెట్ సంఘం అభినందన..

ఏసీఏ అంతర్‌జోనల్ క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన నంబళ్ల సుశాంత్ అజేయ సెంచరీ సాధించడంపై జిల్లా క్రికెట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పీఎల్ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ రవికుమార్ తదితరులు అభినందించారు. గత కొన్నేళ్ల నుంచి సుశాంత్ అద్భుతమైన ఆటతీరుతో రాణిస్తుండటం శుభపరిణామమని కొనియాడారు. సుశాంత్ రాణింపు పట్ల తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు సంతోషం వ్యక్తంచేశారు.

ఇయర్ అండ్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ) ఇయర్ అండ్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్ష నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం తెలిపారు. 2011 నుంచి 2015 మధ్య ఏడాదిలో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో బుధవారం నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఫీజు సైతం 14వ తేదీలోపు చెల్లించాలని, ఆగస్టు 20 నుంచి హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రయోగ పరీక్షలు ఆగస్టు 22 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 3వ తేదీ నుంచి థియరీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఫీజులు మూడో ఏడాదికి రూ. 10 వేలు, రెండు, మొదటి ఏడాదిలకు రూ.8000, పేపర్ల వారీగా పేపరుకు రూ.మూడు వేలు, ప్రయోగాలకు మొత్తం సబ్జెక్టులకు రూ.10 వేలు, ఒక సబ్జెక్టు ప్రాక్టికల్‌కు రూ.3 వేలు, ప్రాజక్టు వైవా వాయిస్‌కు రూ.3వేలుగా చెప్పారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కోర్టులో హాజరైన చోరీ కేసు నిందితులు



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్సై ఎం.రాజేష్, సిబ్బంది

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామంలో ఫిబ్రవరి నెలలో సుమారు రెండున్నర తులాల బంగారం గొలుసు చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 24 అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రెండున్నర తులాల బంగారం గొలుసు చోరీ చేశారని, బాధితురాలు సురగాల సరోజినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్థానికంగా తిరుగుతున్న జొన్నాడ సుజాత, చెరుకుబిల్లి శేఖర్‌లపై అనుమానం వచ్చి సిబ్బంది సహకారంతో విచారించగా బంగారం గొలుసు చోరీచేసినట్లు అంగీకరించారని చెప్పారు. దీంతో నిందితులను పార్వతీపురం కోర్టులో హాజరుపర్చినట్లు తెలియజేశారు.

100 సారా ప్యాకెట్ల పట్టివేత

కొమరాడ: మండలంలోని గంగరేగువలస గ్రామ సమీపంలో ఎం.సుధాకర్ అనే వ్యక్తి సారా అమ్ముతుండగా మంగళవారం పట్టుబడినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. దీంతో నిదితుడి నుంచి 100 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై చెప్పారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్లు

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. మొత్తం మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించగా న్యాయమూర్తి ట్రాక్టర్ యజమానులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని ఏఎస్సై గొడు భాస్కర రావు విలేకరులకు తెలిపారు.

రెండు ఆటోలు ఢీకొని మహిళ మృతి

- నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతిచెందిన సామమ్మ

మెంటాడ: మండలంలోని దేవుపల్లి నుంచి మెంటాడ వస్తున్న ఆటో, ఆంధ్ర నుంచి బాడంగి మండలం కర్రేడు వలస వెళ్తున్న ఆటో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా మరో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై ఎస్సై దేవి మాట్లాడుతూ మీసాలపేట గ్రామ సమీపంలో రెండు ఆటోలు ఢీకొనడంతో గదబవలసకు చెందిన కెల్ల సామమ్మ అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కోసం 108 వాహనంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించామని, అనంతరం మెరుగైన చికిత్సకోసం విజయనగరం జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అనారోగ్యంతో సైనికుడు..



తేలు దినేష్ (ఫైల్)

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ తేలు దినేష్(34) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దినేష్ ఢిల్లీలో సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వారంరోజుల క్రితం సెలవుపై కన్నంపేట గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపాడు. ఆదివారం రాత్రి హఠాత్తుగా కడుపులో నొప్పి వచ్చి ఎక్కువకావడంతో, బొబ్బిలిలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్సకోసం సోమవారం తీసుకువెళ్లారు. అక్కడనుంచి మెరుగైన వైద్యచికిత్స కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా మంగళవారం మృతిచెందాడు. కుటుంబానికి ఆధారమైన ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి దండ్రులు శ్రీరాము, పార్వతిలు, మృతుని భార్య అనూష కన్నీరు మున్నీరవుతున్నారు. జవాన్ దినేష్ మృతిచెందడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

మెలకువలతో ఖరీఫ్‌లో సాగుదాం

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- జిల్లాలో లక్షా 75వేల ఎకరాల్లో వరి సేద్యం లక్ష్యం
- 15 మండలాల్లో 306 రైతుసేవా కేంద్రాల ద్వారా తోడ్పాటు
- ఇప్పటికే 18వేల హెకార్లలో వెదలు జల్లిన రైతులు
- వాతావరణ అనుకూలతతో ఉబాలకు సిద్ధం



నారును కట్టలు కడుతున్న రైతులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణ అనుకూలతతో వర్షాలు పలకరిస్తున్నాయి. వ్యవసాయ సీజన్ కీలకదశకు చేరడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 73 వేల హెక్టార్లలో సాగు లక్ష్యంగా యంత్రాంగం పనిచేసింది. ఈ ప్రాంత రైతుల అవసరాల మేరకు 26,416 క్వింటాళ్ల వరి వంగడాలు, 45.276 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించేలా ఖరీఫ్ ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. 306 రైతు సేవా కేంద్రాల ద్వారా సీజన్‌కంటే ముందుగానే విత్తనాలు, ఎరువులు అందించారు. దీంతో ఇప్పటికే 18వేల హెక్టార్లకు పైబడి వెదజల్లే పద్ధతిని రైతులు అనుసరించారు. తాజాగా తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో 30,602 ఎకరాలకు, కుడి కాలువ పరిధిలో 7,942 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు ఇరిగేషన్ అధికారులు సమాయత్తమయ్యారు. ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాలువకు 150 క్యూసెక్కులు, కుడి కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా వరుణుడి కరుణ కూడా తోడైంది. దీంతో వెదలు జల్లిన భూములు మినహాయించి మిగిలిన 55వేల హెక్టార్లలో ఉబాలు చేపట్టే పనిలో రైతులు పడ్డారు. ఇదివరకే సిద్ధం చేసుకున్న వరి నారును కట్టలు కడుతున్నారు. పొలాల్లో నాట్లు వేసేందుకు మురుగు దమ్ములు చేపడుతున్నారు. ఈ తరుణంలో అన్నదాతలు సాగులో మెలకువలను అవలంబిస్తే మరింత మేలైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి చెబుతున్నారు.



తుమరాడ సమీపంలో మడిలో పెరుగుతున్న నారు



శ్రీకాకుళం రహదారిలో నాట్లు వేస్తున్న మహిళలు

పొలం సిద్ధం చేయడం ఇలా..

- నాట్లు వేయడానికి 15 రోజులు ముందు పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2–3 మార్లు మురుగు దమ్ము చేపట్టాలి.
- పొలమంతా సమానంగా ఉండేలా దమ్ములో చెక్క లేక అడ్డతో చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి రెండు రోజులు ముందుగా దమ్ము చేపట్టి తర్వాత నాట్లు వేసుకోవడం మేలైన పద్ధతి.

నాట్లు వేసే సమయంలో..

- నారు సేకరించే సమయంలో లేత ఆకుపచ్చగా ఉంటే మేలు. 25 నుంచి 30 రోజుల వయస్సుగల నారు అయితే మంచి దిగుబడి వస్తుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారు నాట్లుకు ఉపయోగించాలి. ముదురు ఆకు నాటాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనలు పాటించాలి.
- నాట్లు వేసే సమయంలో భూ సారానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలి బాటలు ఉండేలా జాగ్రత్తపడాలి.
- అప్పుడే గాలి, వెలుతురు సమకూరి చీడ, పీడలను, సుడి దోమలను సమర్థవంతంగా అధిగమించవచ్చు.
- బాటలు ఏర్పాటు చేయడంతో ఎరువులు, పురుగు మందులు వేసేందుకు, కలుపు తీయించేందుకు ఇవి ఉపయోగపడతాయి.
- వరి వంగడాల రకాలను అనుసరించి కుదుళ్ల సంఖ్యను నాటే సమయంలో నిర్ధారించుకోవాలి. భూసారం అధికంగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు నాటుకోవాలి.
- ముదురు నారు వాడాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడుకోవాలి.

యాజమాన్య పద్ధతులు..

- భూసారానికి అనుగుణంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా సమపాళ్లలో వాడుకుంటే మేలు.
- పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు, సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.
- వరి భూముల్లో అపరాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైరును కలిపి కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను 25 శాతం మేర ఆదా చేయవచ్చు.
- సజీవ ఎరువులైన నీలిపచ్చనారు, అకోళ్ల, అజోసై, అజోస్పైరిల్లమ్, పోస్ఫోబాక్టీరియా వంటి జీవ ఎరువులను వాడి నత్రజని, భాస్వరం మోతాదులను 20 శాతం వరకు తగ్గించుకోవచ్చు.
- వరినాట్లు వేసిన తరువాత 7–10 రోజుల వ్యవధిలో మడిలో పలచగా నీరు నిల్వబెట్టి ఎకరాకు 4 కిలోలు నాచుపొడిని ఇసుకతో కలిపి మడి అంతా సమానంగా కలిసేలా చల్లుకోవడం మేలు.

కాన్పుకెళ్తే కడుపు కోతే..!

- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువశాతం సిజేరియన్లే

గత మూడు నెలల్లో జరిగిన సిజేరియన్లు

నెల	సిజేరియన్లు
ఏప్రిల్	175
మే	167
జూన్	159



పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి గత నెల ఒక గర్భిణి వచ్చింది. ఆమె సాధారణ ప్రసవానికి అవసరమైన ఆరోగ్య, మానసిక పరిస్థితులు ఉన్నాయి. మూడు నెలలుగా చేస్తున్న పలు పరీక్షల రిపోర్టులు బాగా ఉన్నాయి. సాధారణ కాన్పు చేయాలని కుటుంబసభ్యులు కోరారు. అయినా సరే ఆస్పత్రి సిబ్బంది భయపెట్టి సిజేరియన్ వైపు మళ్లించారు. సుమారు రూ.1.2లక్షల దాకా బిల్లు చేశారు. నెల తిరక్కముందే ఆ మహిళకు తీవ్ర కడుపు నొప్పి వస్తోంది. వైద్యులను సంప్రదిస్తే సిజేరియన్ సైడ్ ఎఫెక్ట్ వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎందరో మహిళలకు శాపంలా తయారైంది. అవసరం ఉన్నా, లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాన్పు కోతలు పెరిగిపోతున్నాయి.

సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు, కడుపులో బిడ్డ సరిగా లేనప్పుడే సిజేరియన్ చేయాలి. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డం తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకుంటోందని, పురిటి నొప్పుల బాధ భరించలేరని పేర్కొంటూ బాధిత బంధువులను భయపెట్టి అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవంతో పోలిస్తే సిజేరియన్‌కు పట్టే సమయం కూడా చాలా తక్కువ. సర్జరీ చేయడం వల్ల ప్రైవేట్ ఆస్పత్రికి ఆదాయం సమకూరుతుంది. సిజేరియన్ తర్వాత తరచూ కడుపు నొప్పి, ఇన్ఫెక్షన్, అధిక బరువు, నెలసరి వంటి సమస్యలకు కారణమవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో ముప్పు తెచ్చి పెట్టే విషయం. కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే సిజేరియన్లు చేయాలి. ఇది మొత్తం కాన్పుల్లో 25 శాతానికి మించడం ప్రమాదం. అయితే జిల్లాలో ఇది 50 శాతం పైగా ఉంటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సిజేరియన్ వల్ల తల్లీబిడ్డకు నష్టం

ప్రస్తుతం ఆస్పత్రుల్లో ఎక్కువగా జరుగుతున్న సిజేరియన్ల వల్ల తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదాలు ఉన్నాయని నిపుణులైన వైద్యులు చెబుతున్నారు. ఆపరేషన్లు చేయించుకోవడం వల్ల లాభాల కన్నా నష్టాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు తాగితే అవి అమృతంతో సమానం అంటున్నారు. శస్త్ర చికిత్సల కారణంగా మొదటి గంటలో తల్లిపాలు తాగే వీలు లేకుండా పోవడంతో నష్టం జరుగుతోంది. రక్తస్రావం అధికమైనా, ఇతరత్రా సమస్యలు తలెత్తినా ప్రాణాపాయంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి రావచ్చు. గర్భాశయానికి గాట్లు పెట్టి కుట్లు వేసిన ప్రాంతంలో మాయ అతుక్కుపోయే అవకాశాలుంటాయి. దీంతో అప్పుడప్పుడు తీవ్ర కడుపు నొప్పి సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భసంచి తొలగించే పరిస్థితి రావచ్చు.

మంచి ముహూర్తం కావాలంటూ..

కొందరు గర్భిణులు, కుటుంబ సభ్యులు కూడా సిజేరియన్‌కు మొగ్గుచూపుతున్నారు. నొప్పి భయం తప్పించుకునేందుకు మంచిముహూర్తం అంటూ వైద్యులపై ఒత్తిడి తెచ్చేవారు కూడా ఉంటున్నారు.

సాధారణ ప్రసవాలతో ప్రయోజనాలు

సాధారణ ప్రసవాల వల్ల తల్లీపిల్లలకు బహుళ ప్రయోజనాలు అందడానికి వీలుంటుంది. సాధారణ ప్రసవాల్లో మహిళలు రెండు రోజుల్లోనే ఎప్పటిలా పనులు చేసుకోవడానికి వీలుంటుంది. రెండో కాన్పుపై దుష్ప్రభావం ఉండదు. గర్భసంచికి ప్రమాదం ఉండదు. భవిష్యత్తులో రుగ్మతలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లిపాలు అందించవచ్చు.

అనవసరంగా సిజేరియన్లు చేస్తే చర్యలు

జిల్లాలో సాధారణ ప్రసవాలు ఎక్కువ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. సిజేరియన్ వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరిస్తున్నాం. ముఖ్యంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. అటువంటి వాటికి మెమోలు అందజేస్తున్నాం. ప్రత్యేకంగా ఆడిట్ చేస్తున్నాం. అనవసరంగా చేస్తున్నారని తెలిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రిని సీజ్ చేస్తాం. గర్భిణులు, కుటుంబ సభ్యులు సిజేరియన్ల వైపు మొగ్గు చూపకుండా ఉండాలి.

– డాక్టర్ శివ కుమార్, ఇన్‌చార్జి జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, పార్వతీపురం

సెలవు రోజుల్లో తరగతులు కూడదు

- డీఈఓ ప్రేమ్‌కుమార్



మండల విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ ప్రేమ్‌కుమార్

చీపురుపల్లి: సెలవు దినాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు చీపురుపల్లి మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండల ఆ కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంఈఓ, సీఆర్‌ఎంటీ, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం పని చేసే విధంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల విద్యాశాఖపై ఉంటుందని స్పష్టం చేశారు. సెలవు రోజుల్లో కచ్చితంగా సెలవు మాత్రమే పాటించాలని, అందుకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే ప్రైవేట్ పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

బైక్‌లు, బంగారం దొంగల అరెస్ట్



దొంగలు, వాహనాలతో ఎస్సై జయంతి, సిబ్బంది

బాడంగి: కొన్నాళ్లుగా బైక్‌లు, బంగారం దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను బాడంగి పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేయడంతో పాటు చోరీసొత్తు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. దీనిపై ఎస్సై జయంతి తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆకులకట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మంగళవారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగాడడాన్ని గమనించి పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారిద్దరినీ విచారణ చేయగా బైక్‌లు, బంగారు నగల దొంగతనంలో పాతనేరస్తులుగా తేలింది. వారిద్దరిని పార్వతీపురం మండలం పిన్నింటి రామినాయుడు వలసకుచెందిన మరిపిగోపి, పార్వతీపురం పట్టణంలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీకి చెందిన ఆరిక నరేష్‌గా గుర్తించి వారినుంచి 4 గ్లామర్, ఒక ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, 90గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిద్దర్నీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి ఏజేఎఫ్‌సీ కోర్టుకు తరలించగా కోర్టు సబ్‌జైలుకు రిమాండ్ విధించినట్లు ఎస్సై జయంతి వివరించారు.

కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: కిడ్నాప్ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నలుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని డకినివీధిలో రాజస్థాన్‌కు చెందిన భగవాన్ రామ్ గ్యాస్‌స్టవ్‌ల వ్యాపారం చేస్తూ కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నాడు. గత నెల 14న భగవాన్ రామ్ ఉండే ప్రాంతానికి రాజస్థాన్‌లో పరిచయం ఉన్న బిజిలారామ్ మరికొంతమందితో వచ్చి భగవాన్ రామ్‌ను కలిసి, వైజంక్షన్‌కు కారులో తీసుకువెళ్లి అక్కడ మద్యం పట్టించారు. అనంతరం తమ ఆడవారికి అసభ్యకర మెసెజ్‌లు పంపిస్తున్నాడనే నెపంతో భగవాన్ రామ్‌ను తీవ్రంగా కొట్టి, బలవంతంగా కారులో ఎక్కించి కొంతదూరం తీసుకువెళ్లి ఒక బాటిల్‌లో మూత్రం వేసి, బలవంతంగా తాగించి, ఆ వీడియోను రికార్డ్ చేశారు. అతని స్నేహితుడికి ఫోన్ చేయించి రూ.35 వేలు ఫోన్‌పే చేయించుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి, భగవాన్‌రామ్‌ను విడిచిపెట్టి పరారయ్యారు. వారు రాజస్థాన్ వెళ్లి ఇక్కడి వీడియోను వైరల్ చేయడంతో భగవాన్ రామ్ కుటుంబసభ్యులు చూసి ఆందోళన చెందారు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గత నెల 25న బిజిలారామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగతా నలుగురి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నలుగురు నిందితులు వజారామ్ దేవాన్ష్, దీపేష్ కుమార్, రమేష్, లీలారామ్, గణేష్ రామ్‌లను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై, సిబ్బందిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



సంతోషిమాత అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సిరి సహస్ర

విజయనగరం టౌన్: స్థానిక మయూరీ జంక్షన్ వద్ద కొలువైన జై సంతోషిమాత ఆలయ వార్షికోత్సవ మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్ తివారీ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సుప్రభాతసేవ, గణపతిపూజ పుణ్యాహవచనం, శ్రీచక్రమండపారాధన, సహస్ర కుంకుమార్చనలు, హోమం, మహా పూర్ణాహుతి, రాత్రి మంగళహారతి నిర్వహించారు. అమ్మవారిని ప్రదీప్‌నాయుడు, సిరి సహస్రలు దర్శించుకుని పట్టువస్త్రాలను, పసుపు, కుంకుమలను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

18న ఇంటర్వ్యూలు

నెల్లిమర్ల: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ టీచర్స్ పోస్టులకు ఈనెల 18న డెమో, ఇంటర్వ్యూలు జరుగుతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితం, జంతుశాస్త్రం, హిందీ, ఎకనామిక్స్, స్టాఫ్‌నర్స్ ఖాళీ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 18న స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నామన్నారు. గెస్ట్ టీచర్స్‌కు సంబంధించి సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. స్టాఫ్‌నర్స్ పోస్టులకు జీఎన్ఎం, పీడీ పోస్టుకు బీపీఈడీతో పాటు ఏదైనా పీజీ, ఎంపీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సమన్వయకర్త కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

రామతీర్థం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



దక్షిణ ద్వారం వద్ద పూజలు చేస్తున్న ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం దేవస్థాన అభివృద్ధిలో దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఈఓ వై.శ్రీనివాసరావు అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో ఆస్థాన మండపం, దక్షిణ ద్వారం, తలుపులకు సాలూరుకు చెందిన దాత శంకర్రావు ఇత్తడి రేకులను సమకూర్చగా, ఇటీవల వాటిని సుందరంగా అలంకరించారు. ఈఓ శ్రీనివాసరావు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రామతీర్థం సేవా సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్, అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు


- ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు
- అనుమతి లేకుండా వైద్యులను బదిలీ చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అప్పలనాయిడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కలెక్టర్ బిఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ ఇటీవల మరమ్మతులకు గురైన ఎం.ఆర్.ఐ స్కాన్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆస్పత్రిలో బోరు వేయడానికి నిధులు మంజూరు చేస్తున్నామని, ఇది వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి కొత్తగా రెండు మరుగుదొడ్ల సముదాయాలను మంజూరు చేస్తామని చెప్పారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు వార్డు సచివాలయాల నుంచి ఐదుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై తక్షణమే పంపించాలని కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు. రెండు ఆస్పత్రుల్లో తన అనుమతి లేకుండా వైద్యులు, సిబ్బందిని బదిలీ చేయవద్దని ఆదేశించారు. దాదాపు రూ.80 లక్షల వ్యయంతో సర్వజన ఆస్పత్రి మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఆస్పత్రిలో 6 కేవీ ఆక్సిజన్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి 257 పడకలకు పైపులైన్ వేయనున్నట్టు చెప్పారు. రూ.2.5 లక్షల వ్యయంతో 20 స్ట్రెచ్చర్‌లు కొనుగోలు చేయడానికి, ఘోషాస్పత్రిలో రూ.31 లక్షలతో లిఫ్ట్ ఏర్పాటుకు, సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రుల్లో కేంటిన్, పార్కింగ్, రిటైల్ మెడికల్ షాప్ నిర్వాహణకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని మహరాజ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చేందుకు, ఆస్పత్రిలో పివిజి.రాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సభ్యులు ప్రతిపాదించగా వీటి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించారు. డీఆర్‌ఓ ఎం.సుమబాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కమిటీ సభ్యులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, రామేశ్వరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొడుకు మృతిని తట్టుకోలేక..



పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో ఉన్న రామయ్యమ్మ

నెల్లిమర్ల రూరల్: నవమాసాలు మోసి కనిపెంచిన కుమారుడు చిన్న వయసులోనే మృతి చెందడంతో ఆ తల్లి తట్టుకోలేకపోయింది. బిడ్డ చనిపోయి నాలుగేళ్లు గడిచినా.. క్షణం ఒక యుగంలా గడిపింది. నిత్యం బిడ్డనే తలచుకుంటూ కన్నీరుకార్చేది. బిడ్డ లేని బతుకు తనకెందుకని భావించిదో ఏమో గానీ కుమారుడు చనిపోయిన చోటే తను ప్రాణాలు విడిచిపెట్టాలని నిర్ణయించుకుంది. ప్రాంతం కాని ప్రాంతం వచ్చి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన పోలీసులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది.

అసలు ఏం జరిగిదంటే....: బొండపల్లి మండలం కొండ అగ్రహారం గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి భార్య రామయ్యమ్మతో కలిసి విశాఖలోని మధురవాడలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. 16 సంవత్సరాలు వయస్సు ఉన్న చిన్న కుమారుడు నాలుగేళ్ల కిందట రామతీర్థంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు స్నేహితులతో కలిసి వచ్చి సీతారామునిపేట సమీపంలో ఉన్న రామతీర్థం బోడికొండపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. అప్పటి నుంచి బిడ్డను తలచుకొని తల్లి రామయమ్మ ఏడుస్తూ ఉండేదని భర్త రాము తెలిపారు. ఇటీవల విశాఖ నుంచి స్వగ్రామమైన అగ్రహారానికి వచ్చిన ఆమె.. మళ్లీ విశాఖ వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పి మంగళవారం కుమారుడు మృతి చెందిన సీతారామునిపేట వద్దకు వచ్చి పురుగుల మందు సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న రామయమ్మను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామగణేష్, సిబ్బంది హుటాహుటిన ఆమెను విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రామయ్యమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని, సకాలంలో స్పందించడంతో ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా రామయ్యమ్మ ఫొటోను షేర్‌చేయడంతో కుటుంబ సభ్యుల ఆచూకీని పోలీసులు క్షణాల్లో తెలుసుకొని సమాచారం అందించారు.